క్లుప్తంగా

కళ్ల కలకపై జాగ్రత్త అవసరం

కొల్లిపర: కళ్ల కలక వ్యాధిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వ్యాధి గురించి వివరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. ఆదివారం మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి, ఏఎన్ఎంలకు కళ్లకలకపై అవగాహన కల్పించారు. దుమ్మూధూళి, వేడి, చలి వల్ల కంటిలో ఇన్ఫెక్షన్ వచ్చి తద్వారా కళ్లకలక వస్తుందన్నారు. ఇది అంటు వ్యాధి కావటంతో అతి త్వరగా వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించారు. ప్రతి గ్రామంలో కళ్లకలక గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

న్యాయ సలహా శిబిరం ప్రారంభం



తెనాలి: తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, లీగల్ సెల్ సంయుక్తంగా న్యాయ సలహా శిబిరం ఆదివారం నిర్వహించాయి. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని పద్మనాభుని కోటయ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాళి శేషాచలం ప్రారంభించారు. లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాదులు ఉచితంగా న్యాయ సలహాలతో మార్గదర్శనం చేస్తారని ఆయన తెలిపారు. దరిశి శివకోటేశ్వరరావు, గ్రంధి జయరామకృష్ణ, సంకా ఆంజనేయులు, నాగేంద్రం, జవ్వాజి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య న్యాయవాదులు, అనుబంధ కమిటీల నేతలు ఆతుకూరి పూర్ణచంద్రరావు, కర్పూరపు రఘునాథగుప్తా, ముప్పల శ్రీనివాసరావు గుప్తా, గట్టా వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



తెనాలిటౌన్: నందివెలుగు గ్రామంలో మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సొసైటీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్ కుమార్ సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు ధూళిపాళ్ళ సుధాకర్, చైర్మన్ తోటకూర వసంతరావు మొక్కలు అందజేశారు. సర్పంచ్ పవన్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా గ్రామంలో మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మొక్కలు పంపిణీ చేస్తుండటం అభినందనీయమన్నారు. సంస్థను ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తోటకూర సుబ్బారావు, సంస్థ అధ్యక్షుడు కల్యాణ సాంబశివరావు, ఉపాధ్యక్షుడు యర్రమోతు జగన్ మోహనరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సుకూర్ బాషా, సభ్యులు కల్యాణ కృష్ణసాగర్, చందు, పేరం హేమంత్ సాయి, మోహన కృష్ణ, కాటూరి సాంబశివరావు, సత్యనారాయణ, తిన్నలూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు, జగ్గడిగుంటపాలెంలోని బడ్డీకొట్లను ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు ఆదివారం తనిఖీ చేశారు. బడ్డీకొట్లలో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించినట్టు ఎస్ఐ తెలిపారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్చకుని అదృశ్యం

తెనాలిరూరల్: పురోహితుడు అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కూచిపూడి గ్రామానికి చెందిన 33 ఏళ్ల శంకరశర్మ అర్చకత్వం చేస్తున్నారు. ఈ నెల 6న తెనాలి రైల్వేస్టేషన్‌కు వచ్చిన అతను కనబడకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు ?

మంగళగిరి: ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన పలువురు నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపిన పోలీసులు 11 దొంగతనాలకు సంబంధించి వివరాలు సేకరించి చోరీ చేసిన సొమ్మును రికవరీ చేసినట్లు తెలిసింది. నిందితులు మరెక్కడన్నా చోరీలకు పాల్పడ్డారనే విషయమై పోలీసులు విచారణ చేస్తున్నారు.

అలరించిన సంగీత విభావరి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై ఆదివారం విజయవాడ అభిషేక్ మెలోడీస్ ఆధ్వర్యంలో భక్తి సినీ పాటల సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భగవద్గీత శ్లోకాలు, పలు అన్నమాచార్య కీర్తనలు, భక్తి, సినీ పాటల్ని ఆలపించి ఆహూతుల్ని ఆకట్టుకున్నారు.

ఆల్బెండజోల్ వేద్దాం..అనారోగ్యాన్ని 'నులి'మేద్దాం

- 18ఏళ్ల లోపు పిల్లల్లో నులిపురుగుల సమస్యలు అధికం
- అశ్రద్ధ చేస్తే ఆయాసం, రక్తహీనత
- ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తే సరి
- ఈ నెల 17న పూర్తిస్థాయిలో మిగిలిన వారికి పంపిణీ



కొల్లిపర మండలంలో విద్యార్థులకు ఆల్బెండజోల్-400 ఎంజీ మాత్రలు మింగిస్తున్న వైద్యులు

కొల్లిపర: పిల్లల్లో వచ్చే చాలా అనారోగ్య సమస్యలకు మూలం నులి పురుగులు అని వైద్యులు చెబుతున్నారు. పిల్లల కడుపులో నులిపురుగుల ఉన్నట్లు గుర్తిస్తే సులభ పద్ధతిలో వైద్యం చేయించవచ్చు. తగిన చికిత్స అందిచక పోతే ప్రమాదకరంగా మారే అవకాశాలు ఎక్కువ. నులి పురుగులు హెల్ మెంత్ అనే పరాన్న జీవి జాతికి చెందినవి. ఇవి మూడు రకాలు 1.రౌండ్ వారమ్స్ , 2.పిన్ వారమ్స్ , 3.ఫ్లూక్స్.. వీటిలో రౌండ్ వారమ్స్ జాతికి చెందిన పురుగులు సాధారణంగా కనిపిస్తాయి. పిన్ వారమ్స్, ఫ్లూక్స్ వారమ్స్ జాతి పురుగులు పేగుల్లో జీవిస్తాయి. రౌండ్ వారమ్స్ జాతి పురుగులు 2 నుంచి 5 అంగుళాల పొడవుంటాయి. ఇవి పెంపుడు జంతువులు, కుక్కలు, పిల్లుల్లోనే గాకుండా మట్టిలో కూడా జీవిస్తాయి. పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండడం, మట్టిలో ఎక్కువగా ఆడుకునే సమయంలో చేతులు నోట్లు పెట్టుకోవటం, కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం ద్వారా చిన్నారులకు నులిపురుగుల సంక్రమిస్తాయి.

నులిపురుగుల వ్యాప్తి ఇలా..

హుక్ వారమ్స్, పిన్‌వారమ్స్ అనే జీవులు లార్వా రూపంలో మట్టిలో ఉంటాయి. చెప్పులు లేకుండా మట్టిలో తిరిగేటప్పుడు ఈ జీవులు పిల్లల కాళ్లు, చేతులు చర్మం ద్వారా రక్తంలో ప్రవేశించి, ఊపిరితిత్తుల్లోకి చేరతాయి. అక్కడి నుంచి శ్వాసనాళంలోకి చేరి పురుగులుగా వృద్ధి చెందుతాయి. అక్కడే గుడ్లు పెట్టి వ్యాప్తి చెందుతాయి. ఆ గుడ్లు పిల్లల మలం ద్వారా బయటకు వచ్చి, తిరిగి మట్టిలో లార్వాగా వ్యాప్తి చెందుతాయి.

నులి పురుగుల వ్యాధి లక్షణాలు ఇలా...

నులి పురుగుల బారిన పడ్డ చిన్నారుల్లో ప్రాథమిక దశలో కొద్దిగా జ్వరం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. లార్వా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో తరుచూ కడుపులో నొప్పి, వాంతులు, ఆహారం



జీర్ణం కాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. హుక్ వార్మ్ జాతి పురుగులకు చిన్న దంతాలు వంటివి ఉంటాయి. వాటి సాయంతో అవి అమర నాళాల గోడలకు అతుక్కుని ఉంటూ క్రమంగా రక్తాన్ని పీల్చుకుంటాయి. ఎక్కువ పురుగులు ఉంటే చిన్నారుల జీర్ణ కోశంలో రక్తస్రవం ఏర్పడుతుంది. దీంతో చిన్నారుల్లో రక్తహీనత , పోషకాహార లోపాల సమస్యలు తలెత్తుతాయి. రక్తహీనత కరలిగిన పిల్లల్లో ఆయాసం ఉంటుంది. అలాగే శరీరం పాలిపోయినట్టుగా, నీరసంగా ఉంటారు. చిన్నారుల్లో మట్టి తినే అలవాటు కనిపిస్తుంది.

వేల మంది చిన్నారులకు....

కొల్లిపర మండలంలోని విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలల్లో 1 నుంచి 18 ఏళ్ల లోపు వయసున్న 5,151 మందికి ఆల్బెండజోల్-400 ఎంజీ మాత్రలు వేయాలనే లక్ష్యంతో వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 10న 5,047 మంది పిల్లలకు మాత్రలు మింగించారు. మిగిలిన 104 మందికి 17న పూర్తి స్థాయిలో ఈ మాత్రలు పంపిణీ చేస్తారు. ఈ మాత్రలను భోజనం చేశాక నోట్లో వేసుకుని మింగాలి లేదా చప్పరించాలి. అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు మాత్రలను పొడర్‌గా చేసి నీళ్లలో కలపి తాగించాలి. నాలుగు రోజుల తర్వాత మరొక మాత్ర వేసుకోవాలి, ఇలా ఆరు నెలలకు ఒకసారి వేసుకుంటే మంచిది అని వైద్యులు సూచిస్తున్నారు. మరీ ముఖ్యంగా భోజనం చేసే ముందు ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. మల విసర్జన తర్వాత చేతులను సబ్బుతో క్లీన్ చేసుకోవాలి.

మాత్రలు ఉచితంగా వేస్తారు



పిల్లలకు నులిపురుగులు రాకుండా తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణులు కూడా ఈ మాత్రలు తీసుకోవచ్చు. పిల్లలకు చేతులు శుభ్రంగా కడుక్కోవడం నేర్పించాలి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది ఉచితంగా ఈ మాత్రలు వేశారు. ఈ నెల 17న మిగిలి పిల్లలకు వేయటం జరుగుతుంది. ఇంకా ఎవరికైనా పెద్దవారికి కూడా మాత్రలు కావాలంటే వైద్యాలలో సంప్రదించవచ్చు.

– డాక్టర్ లక్ష్మీసుధ, వైద్యాధికారిణి,కొల్లిపర.

ఇక పక్కాగా ఓట్ల లెక్క

- గ్రామాల్లో చురుగ్గా సాగుతున్న సర్వే
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న బీఎల్‌వోలు
- రాజకీయ పార్టీలతోనూ సమావేశాలు నిర్వహించిన రిటర్నింగ్ అధికారి
- నూతన ఓట్లకూ దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 21తో ముగియనున్న సర్వే

ప్రత్తిపాడు: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైనది. ఓటు ద్వారా నేతల 'రాత'తో పాటు దేశ భవిష్యత్తును కూడా నిర్ణయించవచ్చు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ పొందవచ్చు. ఇందుకోసం ప్రతి సంవత్సరం ఎన్నికల సంఘం ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2024 పేరుతో నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జులై 21 నుంచి ప్రారంభమైన ఈ సర్వే ఆగస్టు 21 వరకూ కొనసాగనుంది. బూత్ స్థాయి అధికారులు నేరుగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేస్తూ, పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వే నియోజకవర్గంలో చురుగ్గా సాగుతుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 285 పోలింగ్ కేంద్రాల్లో 2,54,472 మంది ఓటర్లు ఉన్నారు.

సర్వేలో ఏం చేస్తారంటే...

- అర్హత ఉండీ 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారిని ఓటర్ల జాబితాలో చేర్పిస్తారు.
- ప్రధానంగా తప్పుల సవరణ, నూతన ఓట్లు నమోదు, మృతులు, నకిలీ ఓట్ల తొలగింపు చేపట్టనున్నారు.
- ఓటర్ల జాబితాలో ఒకటి కన్నా ఎక్కువ సార్లు పేరు నమోదైనా, చనిపోయిన వారు ఉన్నా, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారు ఉంటే అలాంటి ఓట్లు తొలగిస్తారు.
- ప్రస్తుతమున్న జాబితాలో ఫొటో సరిగా కనిపించకున్నా మార్చుకునేందుకు అవకాశం ఉంది.



కోయవారిపాలెంలో సర్వేను తనిఖీ చేస్తున్న ప్రత్తిపాడు రిటర్నింగ్ అధికారి ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

- వయస్సులో వ్యత్యాసాలున్నా, ఓటరు ఇంటి అడ్రస్, వ్యక్తిగత వివరాల్లో మార్పులు, చేర్పులకు వెసులుబాటు కల్పించారు.
- ఒకే ఇంట్లో ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని గుర్తించి, ఒకటికి రెండు సార్లు పరిశీలించి తొగించేందుకు చర్యలు
- ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. బీఎల్‌వో ఓటరు యాప్ వెర్షన్ 4.7 ద్వారా నూతన ఓటర్ల నమోదు, పాతవి తొలగించడం వంటివి యాప్ ద్వారానే చేయనున్నారు.

ఇప్పటి వరకూ సర్వే ఇలా..

నియోజకవర్గంలో మొత్తం 285 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఐదు మండలాల్లో 90,467 నివాసాలు ఉండగా, 2,54,472 మంది ఓటర్లున్నారు. ఇప్పటి వరకు బీఎల్‌వోలు 66,907 ఇళ్లకు వెళ్లి, 1,61,621 మంది ఓటర్ల వివరాలు పరిశీలించారు. అంటే 12వ తేదీ వరకు 73.96 శాతానికి పైగా సర్వే పూర్తయ్యింది. 1170 మంది నూతన ఓటుకు ఫారం–6 అందించగా, ప్రాస్పెక్టివ్ ఓటర్లుకు సంబంధించి 142, ఒకే కుటుంబంలో ఎక్కువ ఓట్లు ఉన్నటువంటివి 21, నియోజకవర్గంలో శాశ్వతంగా ఉండని ఓటర్లు 195, మరణించిన వారికి సంబంధించి 459, మార్పులు చేర్పులకు సంబంధించి 2,267 దరఖాస్తులు ఇప్పటి వరకు బీఎల్‌వోలకు అందాయి.

రాజకీయ పార్టీలతోనూ సమావేశాలు

పారదర్శకంగా ఓటర్ల జబితా రూపొందించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. గ్రామాల్లో ఇంటింటి సర్వేను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఆయనే స్వయంగా ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారు. అటు రాజకీయ పార్టీలతోనూ సమావేశాల్ని నిర్వహించారు. జులై 20, 26తో పాటు ఈ నెల 9న నియోజకవర్గస్థాయిలో ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎస్ఎస్ఆర్–2024పై చర్చించారు.

పారదర్శకంగా ఇంటింటి సర్వే

ఈ నెల 21 నాటికి వంద శాతం పూర్తి చేసే లక్ష్యంతో సర్వే జరుగుతోంది. సర్వేపై ప్రత్యేక సమీక్షలూ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే రాజకీయ పార్టీలతోనూ వారానికోసారి సమావేశాలు నిర్వహించి వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. వచ్చిన అభ్యంతరాలనూ వారికి అందజేస్తున్నాం. వలంటీర్ల ప్రమేయమనేది లేకుండా కేవలం బీఎల్‌వోలతోనే సర్వే జరుగుతోంది. ఓట్ల తొలగింపుపై సంబంధిత ఓటర్లకు నోటీసులిచ్చిన తరువాతనే తదుపరి చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటునూ అకారణంగా తొలగించం. 2024 జనవరి ఒకటవ తేదీ నాటికి ఓటరుగా అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. సర్వే అత్యంత పారదర్శకంగా, పక్కాగా జరుగుతోంది.

–ఎం. ప్రభాకర్‌రెడ్డి (నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో, గుంటూరు)

• ఉత్సాహంగా కళాపీఠం స్వర్ణోత్సవం

అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో కళాపీఠం, ఇన్‌టాక్ సంయుక్త నిర్వహణలో కళాపీఠం స్వర్ణోత్సవం ఉత్సాహంగా సాగింది. ఆదివారం తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది ప్రసిద్ధ చిత్రకారుల కళా ప్రదర్శనలు, శిబిరం ఆకట్టుకున్నాయి. అనంతరం సభకు కళాపీఠం అధ్యక్షుడు ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ప్రముఖ చిత్రకారులకు మెమెంటోలను అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం ఉపాధ్యక్షుడు చెరువు రామకృష్ణమూర్తి, కార్యదర్శి ఎస్. విజయ్‌కుమార్, ఉస్మాన్‌ఖాన్, చిత్రకారులు పాల్గొన్నారు.

– పాత గుంటూరు



ప్రదర్శనలో చిత్రాలు







రోటరీ క్లబ్ సేవలు విస్తృతం

జిల్లా అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ

తెనాలి: ఆర్థిక సాయంతో సేవలనే కాకుండా తగిన సమయం కేటాయించి కూడా సమాజ సేవ చేయవచ్చని, ఇందుకు రోటరీ క్లబ్ వేదిక కావటం సంతోషమని 3150 జిల్లా రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ అన్నారు. తెనాలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెంబర్‌షిప్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. క్లబ్ ద్వారా అందించే ఆర్థికసాయం ప్రతి పైసా, అవసరమైన వారికి అందుతుందని చెప్పారు. వీటితోపాటు పర్యావరణం, విద్య, వైద్య, సమాజాభివృద్ధి, మహిళాభ్యున్నతికి రోటరీ క్లబ్ ఎంతగానో తోడ్పడుతున్నట్టు చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు రోటరీ సేవలను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లేందుకు మెంబర్‌షిప్ డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు.



రోటరీ క్లబ్ మెంబర్‌షిప్ డ్రైవ్ ర్యాలీ

ఆగస్టు 15న ఉచిత దంత వైద్యశిబిరం చేపడుతున్నామని, త్వరలోనే రైతు సదస్సులు జరపనున్నట్టు వివరించారు. మున్సిపల్ ఐలమ్మ రజక పార్కు నుంచి ఆరంభమైన ర్యాలీ గాంధీచౌక్ మీదుగా జైన్ టెంపుల్ వరకు కొనసాగింది. క్లబ్ కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి కేవీఎల్ జగదీశ్వరాంబ, సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో సినిమా సమీక్షలు సహేతుకం కాదు

మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

తెనాలి: భారీ పెట్టుబడులతో తీస్తున్న సినిమాల విడుదల రోజునే సోషల్‌మీడియాలో రివ్యూలు, రేటింగులు రావటం సినిమా పరిశ్రమకు అనర్థదాయకమని మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. విడుదల రోజునే వచ్చేస్తున్న సమీక్షల ప్రభావంతో సినిమాల కలెక్షన్లు తగ్గిపోతున్నాయని చెప్పారు. కొన్ని సినిమాలకు స్వార్థపూరిత సమీక్షలతో నిర్మాతలు భారీగా నష్టపోతున్నారని ఆదివారం విలేకరుల సమావేశంలో అన్నారు. కేంద్ర ప్రభుత్వం సినిమా వచ్చినరోజునే రివ్యూల విడుదలపై నిషేధం విధించాలని అభిప్రాయపడ్డారు. అవసరమైతే మా–ఏపీ తరపున కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. భారీ సినిమాల పరిస్థితి ఇలావుంటే, ఇక చిన్న సినిమాలకు దేవుడే దిక్కు అన్నారు. మనుషులందరి మనస్తత్వాలు ఒకటిగా లేనపుడు ఒకరి అభిప్రాయాలను మరొకరిపై రుద్దటం దేనికనీ, రేటింగులు ఇస్తూ రాసే రాతలతో నిర్మాతల బతుకులు మారిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.



దిలీప్‌రాజా

తెనాలి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఎన్నిక

అధ్యక్షుడిగా జవ్వాజి వెంకట కృష్ణారావు

తెనాలి: శ్రీ వెంకటేశ్వర కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, తెనాలి నూతన అధ్యక్షుడిగా జవ్వాజి వెంకట కృష్ణారావు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా అలవల వెంకట నరసింహారావు (హరి), కోశాధికారిగా కొత్తమాసు యజ్ఞప్రసాద్ గెలుపొందారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలోని కల్యాణ మండపంలో ఆదివారం సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఎన్నికలకు బింగుమళ్ల సుబ్రహ్మణ్యం, తల్లం చంద్రశేఖరరావు, మాలేపాటి నాగవెంకట సత్యనారాయణ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. రహస్య బ్యాలెట్ ఓటింగ్ అనంతరం జరిగిన లెక్కింపులో అధ్యక్షుడిగా జవ్వాజి వెంకట కృష్ణారావు 122 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా, కార్యదర్శిగా హరి 89 ఓట్ల మెజారిటీతో, కోశాధికారిగా యజ్ఞప్రసాద్ 141 ఓట్ల ఆధికత్యతో విజయం సాధించారు. అతిథులుగా తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, గుండా రామకోటేశ్వరరావు, రావూరి సుబ్బారావు, జిల్లా అసోసియేషన్ నుంచి కేవీ రంగారావు, కె.చంద్రశేఖరరావు, టీవీ సుబ్రహ్మణ్యం, ఎంవీ వేణుమాధవ్, స్థానిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన పాలకవర్గ నేతలకు అభినందన

'మిస్ తెనాలి' ఆడిషన్స్



అందాల పోటీల్లో పాల్గొన్న మహిళలు

తెనాలి: గుమ్మడి ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుల్తానాబాద్‌లోని స్వర్ణ ఇన్ హోటల్‌లో మిస్ తెనాలి పోటీల ఆడిషన్స్ జరిగాయి. మిస్టర్, మిస్, మిసెస్ కేటగిరీల్లో వీటిని నిర్వహించారు. ముఖ్య అతిథులు గుమ్మడి సాయివాణి, రమ్య పరుచూరి, పల్లవి, నాగమణి, సుభద్ర, సుదీర్ కొడాలి, అమ్మ ఈశ్వర్ పాల్గొన్నారు. గుమ్మడి భావన పర్యవేక్షించారు. మొత్తం 75 మంది పాల్గొన్నారని, గ్రాండ్ ఫైనల్స్ ఆగస్టు 27న జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. ఆసక్తి కలిగిన ఇతరులు కూడా వైల్డ్‌కార్డుతో పాల్గొనవచ్చని వివరించారు.

మృతదేహాలను స్వస్థలాలకు తరలించాల్సిందే !

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని స్వస్థలానికి తరలించకుండా రూల్స్ పేరుతో మహాప్రస్థానం వాహనం నిర్వాహకులు మిన్నకుండిపోవడంపై సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సొంత వాహనంలో చనిపోయిన వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, నిర్వాహకులు దిగి వచ్చారు. ఆదివారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా టోకపల్లికి చెందిన ఓ రోగి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతదేహాల్ని ఉచితంగా తరలించేందుకు ప్రభు త్వం మహాప్రస్థానం వాహనాల వారితో ఒప్పందం చేసుకుంది. అయితే, వారు ఏలూరు వరకు మాత్రమే మృతదేహాన్ని తీసుకెళ్తామని, అక్కడి నుంచి ప్రైవేటు వాహనంలో తీసుకెళ్లాలని చెప్పారు. దీనిపై వాహనాల జోనల్ మేనేజర్‌తో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫోన్‌లో మాట్లాడారు. సొంత ఊరికి తరలించాలని చెప్పినా వారు నిబంధనల పేరుతో నిరాకరించారు. జీజీహెచ్‌కు రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల నుంచి చికిత్స కోసం వస్తున్నారని, ఒకవేళ వారు చనిపోతే తప్పనిసరిగా వారి స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించాల్సిందేనని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. జోనల్ మేనేజర్‌కి చెప్పినా చలనం లేకపోయేసరికి సూపరింటెండెంట్ తన సొంత కారులోనే మృతదేహాన్ని తరలించేలా ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న మహాప్రస్థానం నిర్వాహకులు వ్యాన్‌లోనే మృతదేహాన్ని తరలించారు.



మహాప్రస్థానం డ్రైవర్‌తో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

వీనుల విందుగా సుమధుర సినీ సుస్వరాలు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆదివారం సాయిబాబా టెలీ ఫిలిమ్స్ వ్యవస్థాపకుడు డి.టి. సాయిబాబా ఆధ్వర్యంలో సుమధుర సినీ సుస్వరాలు పేరున నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. గాయకులు సాయి పలు చిత్రాల్లోని పాటల్ని శ్రావ్యంగా ఆలపించారు.